క్లుప్తంగా

వేగంగా వాటర్ గ్రిడ్ పనులు



గోరుకల్లులో నిర్మిస్తున్న పంప్‌హౌస్

పాణ్యం: డోన్ నియోజకవర్గానికి మంచినీటి సరఫరా కోసం చేపట్టిన వాటర్‌గ్రిడ్ పనుల శరవేగంగా జరుగుతున్నాయి. 138 గ్రామాలకు సురక్షిత మంచినీటిని అందించే ఈ ప్రాజెక్టును రూ.297కోట్లతో చేపట్టారు. గోరుకల్లు నుంచి ప్రతి పైపులైన్ ద్వారా 15 క్యూసెక్కుల చొప్పున నీటిని తరలించేలా నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం జలాశయంలో పంప్‌హౌస్ పనులు వేగవంతమయ్యాయి. గోరుకల్లు నుంచి పాణ్యం మండలంలోని సుగాలిమెట్ట హైవే పక్కన ఏర్పాటు చేస్తున్న సంప్‌స్టోరేజీ పనులు దాదాపుగా పూర్తి కావచ్చినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

భక్తులకు అన్నదానం

గూడూరు రూరల్: పట్టణంలోని తెలుగు వీధిలో కొలువైన శ్రీ చౌడేశ్వరీదేవి దేవాలయంలో శుక్రవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రతి నెల కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని దాతల సహకారంతో ఈ కార్యక్రమా న్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

రేపు ఉల్చాలలో క్రికెట్ టోర్నమెంట్

కర్నూలు (న్యూటౌన్): సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 8వ తేదీన ఉల్చాలలోని పోతన్న గట్టులో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ విద్యాసాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రికెట్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.20,016, రెండవ బహుమతి రూ.10,016 అందజేస్తామని పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజు రూ.500 ఉంటుందని, మరిన్ని వివరాలకు ఆర్గనైజర్స్ 9515050519, 7997878245, 8886468433, 7330730733 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పోలకల్‌లో రైతులకు రైతు భరోసా సంచికలను అందజేస్తున్న ఏఓ

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోలకల్ గ్రామ ఆర్బీకేలో వ్యవసాయ సలహా మండలి సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో పలు అంశాలపై సభ్యులు, రైతులు, వ్యవసాయ సిబ్బందితో ఆయన చర్చించారు. అనంతరం రైతులకు రైతు భరోసా సంచికలను అందజేసి మాట్లాడారు. రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తోందన్నారు. యంత్రాలు అవసరమైన రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలని తెలిపారు.

కొనసాగుతున్న భూముల రీ సర్వే

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే పకడ్బందీగా కొనసాగుతోంది. భూ సమాచారం ప్రకారం వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులు ఫీల్డ్‌కి వెళ్లి పరిశీలిస్తున్నారు. రైతులు పొలాల్లో ఉండి భూ వివరాలను సర్వే బృందాలకు అందజేస్తున్నారు.

సెలవుల్లో కర్నూలు రూరల్ తహసీల్దార్

కర్నూలు (న్యూటౌన్): వ్యక్తిగత పనుల మీద కర్నూలు రూరల్ తహసీల్దార్ డి. వెంకటేష్ నాయక్ రెండు రోజులు సెలవు పెట్టారు. 6, 7 తేదీల్లో ఆయన స్థానంలో కర్నూలు అర్బన్ తహసీల్దార్ ఐ. విజయశ్రీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారు.

నేడు ఎల్లమ్మ హుండీ కానుకల లెక్కింపు

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని వెంకాయ పల్లె ఎల్లమ్మ తల్లి హుండీ కానుకలను శనివారం లెక్కించనున్నారు. పోలీసు బందోబస్తు మధ్య కానుకల లెక్కింపు చేపడుతున్నట్లు దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి, చైర్మన్ బేతం కృష్ణుడు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు



గూడూరు: స్థానిక బాలుర హాస్టల్ విద్యార్థులకు ఎస్ఐ గోపాల్ శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలం కావడంతో పేద విద్యార్థులకు తన వంతుగా దుప్పట్లు అందించినట్లు ఆయన తెలిపారు. హాస్టల్ వార్డన్ వలి ఆయనకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యాన పంటలకు ఊతం

- పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రాధాన్యం
- ఉపాధి హామీ పథకం ద్వారా సాయం
- ఎకరాకు రూ.1,35,000 వరకు ఆర్థిక తోడ్పాటు
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు



ఉపాధిహామీ పథకం కింద సాగు చేసిన జామ పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

కోడుమూరు: పండ్ల తోటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులతో పాటు వైఎస్సార్ జలకళ లబ్ధిదారులకు, సన్న, చిన్నకారు రైతులకు అదాయ మార్గాన్ని సమకూర్చడమే లక్ష్యంగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా వారికి తోడ్పాటు అందిస్తోంది. దీంతో రైతులు పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. 2020–21లో కర్నూలు, నంద్యాల జిల్లాలో 2,820 ఎకరాల్లో రైతులు పండ్ల తోటలు సాగుచేశారు. ఒక్క కోడుమూరు నియోజకవర్గంలోనే 1200 ఎకరాల్లో వివిధ రకాల పంట తోటలు సాగు చేశారు. ఈ ఏడాది మరో వెయ్యి ఎకరాల్లో పండ్ల తోటలు సాగు పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ఉపాధి సిబ్బంది గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మామిడి, చీనీ, నిమ్మ, దానిమ్మ, చింత, మల్లెపూలు, గులాబీ తదితర పంటలతోపాటు డ్రాగన్ ఫ్రూట్ కూడా సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఉపాధిహామీ పథకం కింద రైతులు సాగు చేసే పండ్ల తోటలను బట్టి బిల్లులు మంజూరు చేస్తున్నారు. గుంతలు తవ్వుకోవడం, మొక్కకు మొక్క ఎంత దూరం ఉండాలి, ఎకరాకు ఎన్ని మొక్కలు నాటాలి అనే విషయాలపై రైతులకు ఉపాధి సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. పండ్ల తోటలు సాగు చేసిన రైతులకు మొక్కల సంరక్షణకు మొదటి ఏడాది ఎకరాకు రూ.65వేలు, రెండో ఏడాది రూ.35 వేలు, మూడో ఏడాది రూ.33 వేల చొప్పున ప్రభుత్వం రైతులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. దీంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉద్యాన పంటల సాగుకు స్థానిక రైతులు ముందుకొస్తున్నారు.

ఉచితంగా మొక్కల సరఫరా:

ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటలు సాగుచేయాలనుకున్న రైతులు వివిధ రకాల పండ్ల మొక్కలను ముందుగా కొనుగోలు చేయాలి. ఆ తర్వాత వాటికి సంబంధించిన బిల్లులను అధికారులకు అందజేస్తే ఆ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లోకి జమవుతోంది. పండ్ల తోటలు సాగు చేసుకున్న రైతులకు తప్పనిసరిగా జాబ్‌కార్డు ఉండాలి. ఐదు ఎకరాలోపు పొలం ఉన్న రైతు పట్టాదారు పాస్‌పుస్తకాన్ని ఉపాధిహామీ పథకం సిబ్బందికి అందజేయాలి. మెట్ట, నీటి వసతి ఉన్న వారు పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చు

ప్రతి నెలా బిల్లు మంజూరవుతున్నాయి



ఉపాధిహామీ పథకం ద్వారా జామ సాగు చేసేందుకు దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు అనుమతి ఇవ్వడంతో వెంటనే ఎకరాన్నర పొలంలో జామ మొక్కలు నాటుకున్నాను. మొక్కలను సంరక్షించుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం చేస్తోంది. ప్రతినెల నాతోపాటు నా భార్య ఒక్కొక్కరికీ రూ.3,500 చొప్పున బిల్లు మంజూరవుతోంది. ఆ డబ్బు నేరుగా మా బ్యాంక్ ఖాతాలో జమవుతోంది.

– మధు,ఉద్యాన రైతు

సన్నకారు రైతులకు ఉపయోగం

పండ్లతోటల పెంపకం సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఐదు ఎకరాలలోపు పొలం ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులు. పండ్ల తోటలు సాగు చేస్తే ప్రతి సంవత్సరం స్థిరమైన ఆదాయం వస్తుంది. ఉపాధి హామీ పథకం ద్వారా తోటలు సాగు చేస్తే ప్రభుత్వం వంద శాతం రాయితీ ఇస్తుంది. ఆసక్తి ఉన్న రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తాం.

– రమాదేవి ఏపీఓ

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కోడుమూరు: కోడుమూరు అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల పరిధిలోని ఒక అంగన్‌వాడీ కార్యకర్త, 14అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలియజేశారు. పదవ తరగతి పాసై జూలై 1, 2022 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉన్న వారు అర్హులు అని తెలియజేశారు. దరఖాస్తుదారురాలు వివాహిత అయి ఉండాలన్నారు.

పోస్టులు ఖాళీగా ఉన్న సెంటర్లు

బ్రహ్మణదొడ్డి–1 సెంటర్(కార్యకర్త), గూడూరు–1 సెంటర్(బీసీ–డి), కొత్తపల్లి–(ఎస్టీ),కొత్తకోట–4వ సెంటర్(ఈడబ్ల్యూఎస్), జూలకల్–(ఈడబ్ల్యూఎస్), అమడగుంట్ల–2వ సెంటర్(బీసీ–బీ), తిమ్మందొడ్డి–(ఓసీ),కోడుమూరు–18వ సెంటర్(బీసీ–ఎ), ప్యాలకుర్తి–5వ సెంటర్(ఎస్సీ), కొత్తకోట –3వ సెంటర్(ఓసీ), గోరంట్ల–4వ సెంటర్(ఓసీ), సి.బెళగల్–6వ సెంటర్(ఓసీ), కోడుమూరు–2వ సెంటర్(ఓహెచ్), బ్రహ్మణదొడ్డి1వ సెంటర్(ఎస్సీ), మారందొడ్డి–2వ సెంటర్(ఎస్టీ)లలో ఒక్కొక్కటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇందులో బ్రహ్మణదొడ్డి–1 సెంటర్ మినహా మిగతావన్నీ ఆయా పోస్టులని సీడీపీఓ తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న కూడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక

కోడుమూరు: పట్టణంలో రూ. 9కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీ మణికంఠ ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం చండీ మహారుద్ర, చండీయాగం వైభవంగా జరిగింది. మండల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఉదయం 7 గంటల నుంచే వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య చండీయాగం జరిగింది. ఇందులో 150 మంది జంటలు పాల్గొన్నారు. భక్తులందరికీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటలకు ఆర్యవైశ్య సంఘం మహిళ కమిటీ సభ్యులతో శ్రీ లలితాపారాయణం, విష్ణుపారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుకమ్మ, మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి సోదరులు, కోట్ల హరిచక్రపాణిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు, గంగాధర్, జీతూరి రవి, కాటేగారి రవి, కాటేగారి గోపి, కిరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మల్లాపురంలో గోపూజ చేస్తున్న హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులు

గూడూరు రూరల్: ఆధ్మాత్మిక చింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తోందని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. మల్లాపురంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానములు ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని, జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఇందులో భాగంగా గత నాలుగు రోజులుగా గ్రామంలో గోపూజలు, సంకీర్తనలు, శోభాయాత్రలు, కుంకుమార్చనలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యమ్మ, రామకృష్ణారెడ్డి, మద్దిలేటిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సోమేశ్వరరెడ్డి, సర్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాముడు, జగదీష్, అర్చకులు రాముడు, కేశవులు, కాంతారెడ్డి, తిక్కయ్య, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరు తప్పక వేయాలి

కర్నూలు(హాస్పిటల్): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరును వేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. శుక్రవారం ప్రాంతీయ శిక్షణ కేంద్రం (ఫిమేల్)లో పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర చిహ్నాలు ఉన్న గర్భవతులను గుర్తించి ప్రసవానికి వారం ముందే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. ఆశ, ఏఎన్‌ఎంలు వారికి అందుబాటులో ఉంటూ సుఖప్రసవం అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వంద శాతం అందించాలన్నారు. అసంక్రమిత వ్యాధుల సర్వేలో భాగంగా ప్రతి ఆరోగ్య కార్యకర్త రోజుకు 20 హెల్త్ ఐడీలు జనరేట్ అయ్యేటట్లు చూడాలని సూచించారు. 10 నుంచి 19 సంవత్సరాల కిశోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి రక్తహీనత ఉన్నట్లయితే పోషకాహారం గురించి అవగాహన కల్పించి తగు చికిత్సలు ఇవ్వాలన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని సంతోష్ నగర్ సబ్‌స్టేషన్ ప్రాంతంలోని పలు చోట్ల శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల చేపట్టనున్న అభివృద్ధి పనుల కారణంగా సంతోష్ నగర్, మామిదాలపాడు, ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలు, బావాపురంతో పాటు చుట్ట పక్కల ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్‌డబ్ల్యూపీసీల నిర్మాణానికి స్థల పరిశీలన

కల్లూరు: మండల పరిధిలోని పుసులూరు, పెద్దకొట్టాల గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీల నిర్మాణానికి తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మిస్తోందన్నారు. ఇందులో భాగంగా పుసులూరు, పెద్దకొట్టాల గ్రామాల్లో వాటి ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కల్లూరు:లక్ష్మీపురానికి చెందిన ఎ.దాస్(69) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఈ నెల 1వ తేదీన టీ తయారు చేసే క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో అతడిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, తీవ్ర గాయాలు కావడంతో కోలుకోలేక మృతిచెందినట్లు ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

సమయపాలన పాటించాలి

గడివేముల: సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ విజయసింహారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని పెసరవాయి గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. హాజరుపట్టీని పరిశీలించి సమయపాలన పాటించని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సేవలు అందించాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్‌లను ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోనే అందించిన వలంటీర్లను అభినందించారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించండి



రోగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ

గడివేముల: టీబీతో బాధపడేవారు జాగ్రత్తలు పాటిస్తే త్వరగా కోలుకుంటారని నంద్యాల జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ బాలాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. టీబీ రోగులకు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి అందించిన రేషన్‌ను అందించారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను ప్రభుత్వం ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచిందన్నారు.అనంతరం డ్రైడే సందర్భంగా గడివేములలోని పలువీధులను పరిశీలించి వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ జబీన్, వైద్య సిబ్బంది వేణుగోపాల్ రెడ్డి, రాజశేఖర్, భారతి పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్న

- పింఛన్ వారోత్సవాల్లో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య



ఓర్వకల్లులో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ వీకర్ సెక్షన్ కాలనీలో 36,37,41వ వార్డుల లబ్దిదారులకు పెన్షన్లు అందజేశారు. వైఎస్సార్ పింఛన్ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేశామన్నారు. మూడున్నరేళ్ల కాలంలో పెన్షన్ల కోసమే రూ. 62,500 కోట్లు వెచ్చించామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పెన్షన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులు, నాయకుల అండదండలు తప్పనిసరిగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో లంచాలకు తావు లేకుండా అర్హత ప్రమాణికంగా సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రతి నెల 1వ తేదీన అవ్వాతాతలకు పెన్షన్ అందిస్తున్నామన్నారు. కర్నూలు నగరంలో మొత్తం 35 వేల పెన్షన్‌దారులు ఉన్నారని కొత్తగా 1,360 మందికి పెన్షన్ మంజూరయ్యాని పేర్కొన్నారు.

పేదొడికి ధనవంతులకు మధ్య యుద్ధమిది:

నీతికి అవినీతికి, పేదొడికి ధనవంతుడి మధ్య జరుగుతున్న యుద్ధమని ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య అన్నారు. తమ ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేక టీడీపీ అసత్యా ఆరోపణలు చేస్తోందన్నారు. ఎల్లో మీడియాను అడంపెట్టుకొని ఎలాగైన అధికారంలోకి రావాలని చూస్తున్నారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు అయేషా సిద్ధిఖా, సంగాల సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మీకాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, 21వ వార్డు ఇన్‌చార్జ్ బాల చంద్రారెడ్డి, 36వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు

ఓర్వకల్లు: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన ఓర్వకల్లు పొదుపు భవనం వద్ద ఎంపీడీఓ శివనాగప్రసాద్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పెన్షన్లు పెంచుతున్నారన్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ. 2000 నుంచి రూ. 2,750 వరకు పెంచారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అరకొర మందికే పింఛన్ వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ పెన్షన్ ఇస్తున్నామన్నారు. మండలంలో 7,056 మంది పింఛన్‌దారులుండగా కొత్తగా 284 మందికి పింఛన్లు మంజూరు చేయడమేగాక మరో 123 మందికి పింఛన్లు పునరుద్ధరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో ఛైర్మన్ నాగతిరుపాలు, సర్పంచు తోట అనూష, ఎంపీడీఓ శివనాగప్రసాద్, వివిధ గ్రామాలకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు 80వ వార్డు సచివాలయం పరిధిలోని శర్మనగర్, వాసవి దేవాలయ పరిసర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ సాన శ్రీనివాసులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ... ముఖ్యమంత్రి చిత్రంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సర్కారును ఆశీర్వదించాలన్నారు. నాటి చంద్రబాబు పాలనను నేటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోని తేడను గమనించాలన్నారు. అప్పట్లో ప్రభుత్వ పథకాలు పేదలకు అందేవి కావన్నారు. ఇప్పుడు ఇంటికొచ్చి పథకాలు అందజేస్తున్నారన్నారు. ఇది వరకులాగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల ప్రభుత్వ సేవలను స్థానికంగా ఉన్న సచివాలయ వ్యవస్థ ద్వారా సత్వరం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మిద్దె చిట్టెమ్మ, సంగాల సుదర్శన్‌రెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, కాశపోగు జయరాముడు, ఇప్పల నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, 21వ వార్డు ఇన్‌చార్జ్ బాల చంద్రారెడ్డి, 35వ వార్డు ఇన్‌చార్జ్ సాపురు వీరయ్య, 30వ వార్డు ఇన్‌చార్జ్ సంజన్న, రంగప్ప, పెద్దన్న, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జనరంజక పాలనను ఆశీర్వదించండి





ఈ తాండ్రపాడులో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ , రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యకక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ జనరంజక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ కోరారు. శుక్రవారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో వారికి కలిగిన లబ్దిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకువచ్చిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో 98.5 శాతం హామీలను నెరవేర్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను పెంచడంతో పాటు ప్రతి నెల 1వ తేదీనే అవ్వాతాతలకు పింఛన్ అందజేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో మనబడి– నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశామన్నారు. రూ.1400 కోట్లతో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడిఉచితంగా ట్యాబ్‌లను అందజేశారన్నారు. పేద విద్యార్థుల చదువుకు సీఎం పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ 2 నెహెమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, మాజీ ఉప సర్పంచ్ దానమ్మ, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి, పీఎస్ జగన్నాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా శనివారం ఉదయం 7.30 గంటలకు ఈ తాండ్రపాడు గ్రామంలోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు మండలం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ భాస్కర్ నాయుడు తెలిపారు.

రైతులకు న్యాయం చేయండి

చెన్నై – సూరత్ జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన రైతులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వర్‌రావును కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ కోరారు. శుక్రవారం సాయంత్రం ఆయన బాధిత రైతులతో కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎకరా రూ.కోటి విలువ చేసే భూములు కోల్పోతున్న రైతులకు కనీసం రూ.60 లక్షలు నష్టపరిహారం అందేలా చూడాలన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.4.25 లక్షల చెక్కులను బాధితులకు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అందజేశారు. ప్రైవేట్‌లో వైద్యసేవలు పొందిన గార్గేయపురం చెందిన పల్లె ఎల్లారెడ్డికి రూ.1.20లక్షలు, సి బెళగల్‌కు చెందిన నాయకంటి గోపాలమ్మకు రూ.55వేలు, కర్నూలుకు చెందిన పుట్టా శ్రీనివాస్‌కు రూ.2.50లక్షలు మంజూరయ్యా యి. అందుకు సంబంధించిన చెక్కులను బాధితులకు శుక్రవారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సి. బెళగల్ జెడ్పీటీసీ గిరిజోన్, గార్గేయపురం సింగిల్‌విండో అధ్యక్షుడు వినయ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.